# తోడి దొంగలు

"శార్వాణి"

—x—

నడుస్తున్న రాధ చటుక్కున ఆగి, వెనక్కి తిరిగి చూచింది. నడి బజారులో చప్పట్లు చరచి తనని హేళనచేయడానికితప్ప ఎందుకా ప్రయత్నంచేయాలి? జరిగిన అవమానాన్ని స్వీకరించి, సరియైన సమాధానం యివ్వాలని అభిలషించింది. వెంకట్రావు ఆమెను సమీపించాడు. ఇద్దరూ కలసి ముందుకు నడవసాగేరు.

"మీ మార్గానికి అంతరాయం గల్గించినందుకు మీ రెంతో మధనపడుతున్నారనుకుంటాను. అలా జరిగితే క్షమించమని అడుగుతున్నాను."

అతని ధోరణికి రాధ సన్నగా నవ్వి, వెంటనే ముఖం గంభీరం చేసుకుంది.

"తెలియకుండా జరిగిన పొరపాటుకు, క్షమించబడటానికి అర్హాలు. తెలిసి చేసిన తప్పును క్షమించమని అడగటంలో, మరొక తప్పు చేస్తున్నారన్నమాట."

అతని మొహం వెలవెల బోయింది. అటువంటి జవాబు ఆమె ద్వారా వస్తుందని ఊహించివుంటే, అతడు ముందే జాగ్రత్తపడేవాడు.

"యదార్థాన్ని మీరు సుదీర్ఘంగా అర్థంచేసుకుంటారు. అందుకనే ఆఫీసులో అందరిదృష్టిలో ఆకర్షింపబడుతున్నారు."

ఆమె తృళ్ళిపడి, అతని కళ్ళలోనికి చమత్కారంగా చూచింది.

"అందుబాటులో దొరికితే అందమైన వస్తువు ఎదుటివాని దృష్టిలో మీరు వూహించినట్లే సంభవిస్తుంది."

"మీ మాటలు నాకు అర్థమవుతున్నవి. ఆ వెనుక వున్న నిజంమాత్రం ఎంత తరచినా బోధపడటంలేదు."

"వెనుక దాగిన సత్యాలను తెలుసుకోడానికి, ఒక్క మనస్సే కాదు! హృదయంకూడా అవసరం. సహృదయులయితే, తేలిగ్గా తెలుస్తుంది."

"నే నీవిధంగా మీతో వస్తున్నందుకు మీ రేమి బాధపడరా!"

"మీకీసందేహం, మీరు చప్పట్లు చరచకముందు వచ్చివుంటే, మీరిలా అడిగేవారుకాదు. అయినా నాకు తెలియకడుగుతాను. మీరు నన్ను ఏమని తెలుసుకొని యిచ్చటకు వచ్చారు?"

కొన్ని క్షణాలు అతడు మౌనముద్ర వహించాడు.

"ఎదుటివారు బాధపడతారని తెలుసుండీకూడా మనం కొన్ని తప్పపనులు చేస్తుంటాము. మీరీవిషయంలో నాతో ఏకీభవిస్తారనుకుంటాను."

ఈసారి అతని ముఖంలో కత్తి వేటుకు నెత్తురు చుక్కలేదు.

"మీ మనస్సును గాయపరచాను. ఈ ప్రయత్నం మీకు తెలియాలని చేశానని మీరు అనుకుంటే నన్ను మరొకసారి మీరు అవమానించడానికి పూనుకోరు."

పాపం! మానవుడు ఈ తడవ పూర్తిగా చిత్తయిపోయాడు. కుండపగలగొట్టినట్లు మాట్లాడుతుంటే ఏం చేయగలడు!

దారిలో వాళ్ళిద్దరకు ఎదురైన సుందరం చూచి కనిపించేలాగ నవ్వి, వెళ్ళిపోయాడు.

"అతడు ఎందుకు నవ్వుతున్నాడో మీరు ఆకళింపు చేసుకున్నారా?"

"మీకు తెలియకనా, నన్ను అడుగుతున్నారు."

"మీచేత చెప్పించాలని అడిగాను. ఇప్పుడు నేను

చెప్పినదానిలోకంటె, మీరు చెప్పే విషయంలో బరువు ఎక్కువవుంటుంది."

"మనం యిద్దరం కలసి వెళ్తున్నామని చూచి నవ్వి వుంటాడు."

"ఆ సంగతి నాకు తెలుసు ఆ నవ్వులో స్వభావం ఎటువంటిదా" అని అడుగుతున్నాను.

"మీరు ఆఫీసుకు వెళ్ళినతర్వాత మీరే తెలుసుకుంటారు,"

"జంతువు జంతువును అర్థంచేసుకున్నంత యిదిగా మనిషి మనిషిని అర్థంచేసుకోలేని రోజులు ఆసన్నమయ్యాయి. మరుక్షణంనుంచి 'రాధ-వెంకట్రావులం?' ప్రతిమనిషి హృదయగోళము పగలగొడుతూవుంటారు. ఇద్దరిమనుష్యులకు మధ్యవున్న సంబంధాన్ని కళంకితపరచి జుగుప్సతో మనస్సులను కాల్చుకుంటారు. మొన్న మా మామయ్యతో కలసి వస్తున్నానని, ఎగ్జిబిషన్‌లో జంతువులను చూచినట్లు చూశారు."

"నేనీవిధంగా మీతో వస్తున్నానని మీ కేమైన భయంగా వుందా!"

"పురుషులకు లేనిభయం స్త్రీలకు మాత్రం ఎందుకుంటుంది?"

"అట్లాగ అనుకొని పురుషులలాగ స్త్రీలు ప్రవర్తించరుగదా?"

"అంటే!"

"తర్వాత మీకు చెబుతాను. ఆఫీసు వచ్చేసింది." వెంకట్రావు తనుపనిచేస్తున్న సెక్షన్లోకి వెళ్ళిపోయాడు.

రాధ అకౌంట్స్ సెక్షన్లో కాలుపెట్టిన వెంటనే, మధు విష్ చేశాడు.

"గుడ్ మోర్నింగ్!" రాధ తన కుర్చీలో కూర్చుని అతని వేపు చూచింది.

"ఆడవాళ్ళను నమ్మి ఏ మగవాడు బాగుపడ్డాడో చెప్పండి."

"వచ్చీరావడంతోనే యింత పెద్ద అభియోగాన్ని తెచ్చిపెట్టారు.."

"బోలుడన్ని పనులు మానుకొని, మీరువస్తారని నిన్నల్లా యింటిదగ్గర పడిగాపుల పడివున్నాను."

"చంపేశారు! మోసమంటే యిదేనా!"

"మీరు మోసం చేశారని ఒప్పుకోటంలేదా! మీ కోసం ఎన్నో పదార్థాలు స్పెషల్‌గా తెప్పించినందుకు, బలే దగా చేశారు."

"మీరాప్రయత్నం చేస్తారని తెలుసుండే మానివేశాను. మీకు మంచి పనిష్మెంటు అయింది!"

"మీ రింకెప్పుడూ మా యింటికి రావాలని అనుకోవొద్దు. ఒకసారి దగాబడిన తర్వాత, మళ్ళా మళ్ళా దగాపడటం నాకిష్టంలేదు. అందులో ఆడవాళ్ళచేత."

"ఏమండోయి మధుగారు! నాకు కోపంవచ్చేటట్లు మాట్లాడుతున్నారు."

అంతలో సెక్షన్ హెడ్ వస్తే ఎవరికి వారు గప్‌చిప్‌గా వుండి వారి వారి పనులలో నిమగ్నులై పోయారు.

సాయంత్రం ఒక గంట పర్మిషను తీసుకొని, మధు నాలుగు గంటలకే వెళ్ళిపోయాడు. ఊళ్ళో షాపింగ్ చేస్తుంటే తనస్నేహితురాలితో రాధ అచ్చటకురావడం సంభవించింది.

"మీరు బట్టలు కొంటున్నారన్న సంగతి తెలుసుంటే, మీతో మేము వచ్చేవాళ్ళముగా!" మధుకి తన స్నేహితురాలిని పరిచయంచేసింది.

మీ కథలు చదివినతర్వాత మిమ్మల్ని చూచినప్పుడు అసంభవమైన విషయం సంభవమయినట్లుగావుంది!"

"ఈమెకూడా కవిత్వం వ్రాస్తుంది! అందుకనే ఆ ధోరణి అట్లావుంది."

"నేను కొనడం అయిపోయింది. నాకు సెలవు యిప్పిస్తారా?"

"సెలవు మీ దగ్గర మేము తీసుకోవాలి, అంతా కలసే వెళ్దాం." మధు చేయిపట్టుకొని లోపలకు తీసుకొని వెళ్ళింది. అతడేమాత్రం చాంచల్యాన్ని ప్రకటించలేదు.

"మధు! ఈ చీర చాల బావుంది కదూ!" ఏక వచన ప్రయోగానికి మధు తృప్తిపడ్డాడు.

"చీరలవిషయంలో నాకేమంత నాణ్యం తెలీదు."

"షోవీ చీరలు కట్టుకొనేవాళ్ళ నాణ్యం తెలుసనుకుంటాను."

"చీరల అందచందాల విషయంలో, ఆడవాళ్ళ కంటె మగవాళ్ళకే ఎక్కువ తెలుసును." స్నేహితురాలు వంత పాడింది

వారి మధ్య జరుగుతున్న సంభాషణను శ్రద్ధగా వింటున్న కొట్టువాడు "ఆడవాళ్లు చెప్పింది నిజమని" ధఫీమని ఒప్పుకున్నాడు.

మధు సెలక్టుచేసిన చీర రాధ తీసుకొంది. షాపులోనుంచి బయటకు వచ్చినతర్వాత మధు చేతిలో పేకెట్టు తీసుకుంది.

"మీ ఇంటికి వస్తున్నాం!"

"ఆ ప్రయత్నం చేయవొద్దని మీకు ప్రొద్దున్నే మనవిచేసుకున్నాను."

"మీ ఇంటికివచ్చి మీ ఇంట్లో సర్వస్వాన్ని దోచుకోము లెండి."

"మీకు చేతికి చిక్కేది దారిద్ర్యమేవుంది."

"కవిగారు పేద అరపులు మొదలు పెట్టారు."

"సన్మానంచేసి, రెండు అగ్రహారాలు వ్రాసి యివ్వకూడదా!"

"ఓసి అంతేనా! తలచుకుంటే మీకీరాజ్యంలో పట్టాభిషేకమేచేస్తాం."

"కాగితపు పువ్వులతోనా!"

"ప్రాణంవున్న పువ్వులతోనే!"

"మీతో మాటలు పెట్టుకుంటే, రోజుకి గంటలు పొడిగించాలి! చాల ప్రొద్దుపోయింది వెళ్తాను."

"మేము వస్తామని అంటున్నా కూడా తిరస్కరిస్తున్నారు. ఇంత కంటె అన్యాయం మరొకటి వుంటుందా!"

"బొట్టుపెట్టి పిలచినప్పుడు రాలేదు, యిప్పుడు వస్తారని నమ్మకం ఎక్కడవుందీ!"

రాధ జట్కా పిలపించింది. అందరూ కలసి మధు యింటికి వెళ్ళారు.

"ఏమండీ మీ యింట్లో యింత పెద్ద గులాబిచెట్టు వుందని తెలుసుంటే రోజూ వచ్చేదాన్ని."

గులాబి చెట్టుదగ్గరకు వెళ్ళి పూవులను కోయబోయింద.

"పువ్వులను కోయకండి! మేమెప్పుడూ ఒక పువ్వు కూడా కోయలేదు."

రాధ చటుక్కున ఆగిపోయింది.

"గులాబీలను చిగుళ్లనుంచి త్రుంచివేస్తే చెట్టుకి అందం పోతుంది. పువ్వులన్నీ చెట్టుకుంటే ఎంత అందంగా వున్నాయో చూడండీ,"

"మాసిగలో వుంటే యింకా అందంగా వుంటుందిగా!"

"అని మీరు అనుకుంటున్నారు. కోసిన మరుక్షణమే ఆ అందం వాడిపోతోంది."

"అయితే మేము పువ్వులు పెట్టుకోవడం మీకిష్టం లేదన్నమాట."

మధు వెంటనే చెట్టుకున్న పువ్వులన్నీ కోసి వేశాడు.

"ఇప్పుడు ఆ చెట్టువేపు చూడండీ!" కోసిన

పువ్వులన్నీ మాలగా గ్రుచ్చి, మధు దగ్గరకు వెళ్ళి, ఆ దండ అతని మెడలో వేసింది.

"చాలా బావుంది. ఆ చెట్టుకాదు ఈచెట్టు." రాధ మనస్తత్వం మధు ఎంత ఆలోచించినా అంతు చిక్కడంలేదు.

"మిమ్మల్ని అర్థంచేసుకోవడం నాకు చేతకావడం లేదు. ఏంచేయమంటారు."

రాధ కళ్ళలోనికి తొంగిచూశాడు.

సిగ్గుతో ఆమె కళ్లు తడిసి ఆరిపోయాయి.

"నాకే అర్థంకాదు. మీకేమి అర్థమవుతుంది."

"నలుగురు మగవాళ్లు పనిచేసేచోట మీ ప్రవర్తన కొంచెం మార్చుకోవాలి! ఆడది కాస్త నదరుగా కన్పించేసరికి, మగవాని చిత్తవృత్తి రకరకాలుగా మారుతుంది!"

"మీకుకూడా మారుతుందా!"

"మారితే మారవచ్చు; మేమంతా పరిస్థితులకు వారసులమే గదా!"

"మీరూ అందరిలాగే మాట్లాడుతున్నారు."

"మాట్లాడటంలేదు. మాట్లాడించ బడుతున్నాను. మీకింకా మీ ముందు చాల జీవితంవుంది. ఈ రోజు జరిగినలాగ రేపు జరగదు. మన జాగ్రత్తలో మనం వుంటే, రేపు మనల్ని ఎవరు అపార్థం చేసుకోరు."

"మీరు చెప్పేది!"

"అందరితోను అంత చనువుగా పల్కరించడం తగ్గించండి. మీరు కోరుకుంటున్న గాంభీర్యాన్ని మీతో పల్కరిస్తున్నవాళ్లు గ్రహించడంలేదు. వాళ్లు ఆనందాన్ని వాంఛిస్తున్నారు. అప్పుడు జీవితం ఎంత చులకన అయిపోతుందో మీరు తెలుసుకోవాలి!"

మధు మెడలోవున్న మాలను తీసి ఆమె దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

"ఈ దండ నా మెడలో యింతకుముందు మీచేత వేయబడ్డది. ఇప్పుడు దీన్ని మీ మెడలో వేస్తే, ఏం జరుగుతుందో ఆలోచించారా!"

రాధకేమి అర్థంకాలేదు. మెదలకుండా అతని వంక చూస్తూ వుండిపోయింది!

"నేను మీరు చేసిన పని చేయడంలేదు. నేను చెప్పిన సంగతిని బాగా అర్థం చేసుకోండి."

దండ బల్లమీదపెట్టి వెనక్కి తిరిగి తన కుర్చీలో వచ్చి కూర్చున్నాడు.

పనిమనిషి, కారియర్ తెచ్చి, దూరంగానిలబడింది.

"ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేరా!"

"ఆమెకు భర్తదగ్గరకంటె పుట్టింటిలోనే హాయిగా వుంటుంది. ప్రతిఉత్తరంలో వస్తున్నానని వ్రాస్తుంది, ప్రతిరోజూ నాకు హోటల్ భోజనం తప్పడంలేదు."

"మీ ఆవిడవచ్చేవరకు నన్ను వండి పెట్టమంటారా. మిమ్మల్ని చూస్తుంటే జాలివేస్తుంది. రోజురోజుకీ చిక్కి శల్యమైపోతున్నారు."

మధు మాట్లాడలేదు.

"మీకు అభిమానంతోబాటు ఆగ్రహం ఎక్కువ. మిమ్మల్ని ఏమని అడగడానికి కూడా భయమేస్తుంది. పాపం! ఆ అమ్మాయి మీతో ఎట్లా కాపురం చేస్తుందో!"

"అయ్యగారి కేమండి! వెన్నపూసలాంటి మనసు" పనిమనిషి అడ్డుపడి, వూరుకోలేక అంది.

మధు లేచి నిలబడ్డాడు.

"భోజనం వేళ అయినట్లుగావుంది. వెళ్తాము." రాధ బయలుదేరింది.

"మీరుకూడా భోజనం చేసి వెళ్ళండి ఇంకో క్యారేజి తెప్పిస్తాను."

"మేము కూడా చిక్కాలనివుందా మీకు." రాధ స్నేహితురాలిని వెంటబెట్టుకొని, మధు దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయింది.

చిన్న కొన్న చీరకట్టుకొని రాధ ఆఫీసుకువచ్చింది. ఇంటిదగ్గరనుంచి వచ్చేటప్పుడు సుందరంతో కలిసి వచ్చింది మధు చూశాడు. వెంకట్రావుకూడా చూశాడు. ఎవరిమనస్సులో ఏమనుకున్నారో వాళ్ళకే తెలియాలి. ఆఫీసులో మరి కొంతమంది గుమాస్తాలు చూచి, మనస్సులను యింకా కల్లోలితం చేసుకున్నారు. పైకిమాత్రం ఏమి తోణకకుండా జాగ్రత్త పడ్డారు. బాధ సహించడం చేతకానివాళ్ళు, చెవులు కొరకడం ప్రారంభించారు.

'రాధను మన సుందరంగాడు వల్లోవేసుకున్నాడు.' అక్కసునంతా బయటకు వెళ్ళగక్కాడు ఒక మీసాలరాయుడు.

"శతకోటి లింగాలలో ఒక బోడిలింగం!"

తనకు దక్కలేదనే ఈర్ష్యకొలదీ మొహం మాడ్చుకొని విలపించాడు.

"సిన్సియర్‌గా ప్రయత్నంచేస్తే మనకు మాత్రం కాదంటాడా!" పేవుమెంట్ మీద రంగుల సీతాకోక చిలుకలకోసం హంటింగ్ చేసే రోమియో సన్నగా గొంతుక చించుకున్నాడు.

ఆమెను గురించి రకరకాల అభిప్రాయాలు తయారయ్యాయి. ఎవరికి తోచినట్లుగా వారు వెల్లడి చేస్తున్నారు. లోగుట్టు పెరుమాళ్ళకే తెలియాలి!

సాయంత్రం ఆఫీసునుంచి వెళ్లేటప్పుడు సుందరం ఆమెతోనే బయలుదేరాడు. వాళ్లిద్దరిమధ్య కల్పించిన సంబంధాని ఖాయపరచుకున్నారు. చాటుగా కన్నీరు కార్చేవాళ్లు కార్చేరు.

"మనగురించి చాల అసహ్యంగా చెప్పుకుంటున్నారు." సుందరం ఆమెకు ప్రక్కగా నడుస్తూ అన్నాడు.

"అసహ్యంగా ప్రవర్తిస్తేగా భయపడడానికి! వాళ్ళిష్టమొచ్చినట్లు అనుకోనీయండి."

"వాళ్ళ అనుమానాన్ని యింకా స్థిరంచేయాలి. వాళ్ళమతులు పూర్తిగా పోయేటట్లు ఏడిపించాలి!"

"అందుకనేనా యిప్పుడు కూడా నాతోనే వస్తున్నారు!" సుందరం అదరిపడ్డాడు.

"మీరు నన్ను అపార్థం చేసుకుంటే; మీతో యింత చనువుగా వుండేవాడ్ని కాదు."

"కలంగురితో కాస్త సోషల్‌గా వుండేసరికి, మగవాళ్లు స్త్రీని యింత చవకగా చూస్తారని అనుకోలేదు."

"ప్రత్యక్షంగా నాతో వాదించే వాళ్ళతో, సరియైన సమాధానం చెప్పాను."

ఇంతలో సుందరం యిల్లు వచ్చేసింది. ఆమెను కూడా ఇంట్లోకి రమ్మని ఆహ్వానించాడు.

రేడియో పెట్టాడు. ఆమె వాలు కుర్చీలో జారగిలపడింది.

"మీరు వివాహం చేసుకోదలచుకోలేదా" సుందరం మంచంమీద కూర్చుంటూ, కాటుకతో పెద్దవయిన కళ్ళలోనికి చూస్తూ అడిగాడు.

"నేనీవిషయం ఎప్పుడూ అనుకోలేదు."

"వివాహంలోవున్న సుఖం, యీలా బ్రతకడంలో వుండదనుకుంటాను. ఇప్పుడు మీకు భర్త పిల్లలు, సంసారం, ఏ బాదరాబంధీలేదు. అందుకే ఎప్పుడూ హాయిగా కన్పిస్తారు."

"మీ కెంతమంది పిల్లలు?"

"ఇద్దరు"

'మీకు సంసారం సుఖం బాగుంటుందనుకుంటాను.'

"సంసారం యాంత్రికంగా సాగిపోతోంటుంది. సుఖంమాత్రం సున్న."

"మీరు కూడా ఆధిక్యాన్ని కోరుకుంటారు నిజమేనా?"

"మీరు బాగా అర్థంచేసుకున్నారు."

"అందుకనే నాకు వివాహమంటే ఏవగింపు."

ఇప్పుడు నా మనస్సులో అభిప్రాయాన్ని సరిగా తెలుసుకున్నారు.

అతడు ఆమెకు దగ్గరగా సమీపించి, వెనుకనుంచి రెండు భుజాలమీద చేతులుంచేసి నొక్కిపట్టాడు.

ఆమె చివాలను లేచి నిలబడింది.

"నేను ఆధిక్యాన్ని కోరుతున్నాను."

"ఇంటనే ఆత్మహత్య చేసుకుంటే మంచిది."

"ప్రేమించడం తప్పా!"

"మీలాంటి పెద్దమనుష్యులు ప్రేమించడం మహాపరాధం."

"సౌందర్యాన్ని ఆస్వాదించడంకూడా నేరమా!"

"వొట్టి అల్ప సంస్కారులు. మీ హృదయంలో యింత కల్మషం కరుడుకట్టుకొని పోయిందని తెలుసుంటే, మీకు ఆఫీసులోనే పాఠం నేర్పేదాన్ని."

"రాధ! నేనేకాదు, నీతో చనువుగా వుంటున్న అందరూ అందాన్ని వాంఛించేవాళ్ళేగాని, మనస్సులో మంచివున్నవాళ్లు లేరు."

తిరిగి సమాధానం చెప్పకుండా, రాధ అచ్చటనుంచి వెళ్ళిపోయింది.

ఆ మరుసటి రోజు రాధ ఆఫీసుకి మామూలుగానే వచ్చింది. పూర్వంలాగ ఎవరితోనూ, ఎక్కువగా మాట్లాడుతున్నట్లు లేదు. సుందరం ఆరోజునుంచి నెళ్ళాళ్ళు సెలవుపెట్టి స్వగ్రామం వెళ్ళిపోయాడు. కారణం ఆ సెక్షన్లో రాధకు తప్ప యింకెవరికీ తెలియదు.

ఏదో పనిమీద టెలిఫోను బూత్‌కి వెళ్తే, అచ్చట వెంకట్రావు తారసిల్లాడు.

"ఇవ్వాళ నాజ్‌లో మంచి పిక్చరు, వస్తారా!" అని అడిగాడు.

"సినిమాలకు నేను ఎక్కువగా వెళ్ళను."

"కావలసినవాళ్ళతో ఒకేరిక్షాలో వెళ్తుంటారు"

"మీ కిప్పుడు బాధగావుందా!"

"ఆఫీసంతా కోడైకూస్తుంటే బాధగావుండదా!"

"కుక్కలు అరిస్తే ఏనుగు ఏమి అనుకుంటుంది."

"లెట్ దెమ్ బార్క్ అనుకుంటుంది."

"అంతే!"

"అందుచేతే నాతో సినిమాకు రమ్మని కోరుతున్నాను."

"ఒక్క సినిమా ప్రోగ్రామేనా? ఇంకా ఏమైనా వుందా!"

"మీకేది కావలస్తే అది వుంటుంది."

"మీ మనస్సులో విషయం యిప్పుడు నాకు బాగా బోధపడింది."

"అదే నాకు కావాలి! ధన్యుడ్నయ్యాను!"

"అంతా ఒకే తరగతి. సుందరం...తర్వాత వెంకట్రావు. నా బదులు మీ శ్రీమతిని సినిమాకు తీసుకొని వెళ్ళండి. ఆమెను ఎప్పుడూ మీరు సినిమాకు తీసుకొని వెళ్ళనందుకు ఆమె కోరికను కనికరించి నెరవేర్చండి. చాల సంతోషిస్తుంది."

మళ్ళా వెనక్కి తిరిగి చూడకుండా, అచ్చటనుంచి వచ్చేసింది.

♦ ♦ ♦

తను ఆఫీసులోచేరిన రెండు నెలలోనే చాల మందిని బాగా అర్థంచేసుకొంది. అంతా తోడిదొంగలు. పయోముఖ విషకుంభాలు. తేనిపూసిన కత్తులు. సుందరం పైకి ఎంతో పెద్ద మనిషిలాగ కన్పిస్తాడు. ఇద్దరు పిల్లలు కలిగినా, అతని హృదయంలో కుళ్లు కరగడదనేలేదు. వెంకట్రావు సుందరానికి ఏవిధంగా తీసిపోడు. నీతి కబుర్లు ఏకరవు పెడతాడు. నాలుక వెనుక నిలువెల్లునా విషమే! కాటేస్తే, నెత్తురు చిమ్ముతుంది. ఆటువంటి వాతావరణంలో మసలడం, రాధకు దుర్లభంగానేవుంది. మానవత్వాన్ని చంపుకొని అడుగడుగునా ఆత్మవంచన చేసుకొనే మనుష్యులు, జీవితంలో తారసిల్లుతుంటే, తనకు ధైర్యం పెరుగుతోంది. "దుర్మార్గాన్ని

మంచితోనే సంహరించాలి. అవినీతిని నీతితోనే కాల్చివేయాలి." మనస్సులో నిర్ణయించుకుంది.

రాధ మొదటిఆటసినిమాకు వెళ్ళింది. మధు అదే ఆటకు రావడం సంభవించింది. సినిమా వొదిలి పెట్టిన తర్వాత, అకస్మాత్తుగా మబ్బులు ముమ్మరంగా వ్యాపించిపోయి, కుండపోతగా వర్షం కురవనారంభించింది.

"ఈ వర్షం యిప్పట్లో వదిలేటట్లులేదు. ఇక్కడ ఎంతసేపని నిలబడతాం! మా ఇల్లు దగ్గరగావుంది." మధు రాధవేపుచూచి అన్నాడు.

"కాస్త వెలవనివ్వండి, అలానే చేద్దాం!" గాలి హోరన వీస్తోంది. మబ్బులు విచ్చిపోతున్నయి. తుప్పరపడుతూనేవుంది. మధు రాధతో తను వుంటున్న యింటికి జేరుకున్నాడు.

"ఒక్క రిక్షాకూడా లేకుండా పోయింది!"

"వర్షంలో వాళ్ళు మాత్రం చస్తారా!" తువాలుతో తలవెంట్రుకలను తుడుచుకొని, కుర్చీలో జారిగిలబడింది.

"అమ్మ నా కోసం ఎదురుచూస్తూ వుంటుంది."

"వర్షం వచ్చింది కాబట్టి, కాస్సేపు ఆలస్యంగా వస్తుందని అనుకుంటారు."

మళ్ళా వర్షం పూర్వంకంటె ఎక్కువగా కురుస్తోంది. వరండాలోనికి ఝల్లు కొట్టేసరికి, రాధ అచ్చటనుంచిలేచి గదిలోనికివెళ్ళి మంచంమీద కూర్చుంది.

"వర్షంలో ఏమితడుస్తారు. లోపలకురండి!" మధు గుమ్మందగ్గర కుర్చీవేసుకొని కూర్చున్నాడు.

బయట చాల భీభత్సవంగావుంది. లైట్లన్ని ఆరిపోయాయి. కన్నూ మిన్నూ కానని కటికచీకటి. ఉప్పెనలాగ గాలి, తడవ తడవకి ఉరుము. వర్షానికి వీథులన్ని మడుగులయిపోయాయి.

ఎలక్ట్రిక్ దీపం ఆరిపోతే, కొవ్వొత్తి వెలిగించి పెట్టాడు.

"తెల్లవార్లూ వుండేటట్లుంది గాలి వాన."

"ఇటువంటి సమయాల్లో మీరు ఒంటరిగావుంటే చాల భయపడతారనుకుంటాను."

"మీకు అట్లానే వుంటుందా!"

"నాకనిపించదు."

"ఎందుకని?"

"నేనెప్పుడు ప్రళయాన్నే కోరుకుంటాను. తుఫాను, భూకంపాలు, యుద్ధాలు భూమికి అప్పుడప్పుడు అవసరం. పర్యవసానంగా కొత్త జన్మ కొత్త మనుష్యులు ఉత్పన్నమవుతారు."

"అని అంటారేగాని, చావడానికి భయపడుతునే వుంటారు. సుందరం వెంకట్రావులమీద మీకు ఎటువంటి అభిప్రాయంవుంది?"

"నా మనస్సుకి తెలిసినంతవరకు, మంచి మనుష్యులుకారని. అయినా వారిద్దరి గురించి ప్రత్యేకంగా ఎందుకు తెలుసుకోవాలని అనుకుంటున్నారు?"

"తెలుసుకోవాలని బుద్ధి పుట్టింది. అంతే!"

"నా గురించి మరొకరిద్వారా తెలుసుకోవాలని బుద్ధి పుడుతుందా!"

"ఈ సందర్భంలో మీరు నాకు అర్థంకావడం లేదు."

"బహుశా మీరుకూడా అంతేనేమో!"

"నన్నిప్పుడేకాదు, ఎప్పుడూ అర్థంచేసుకోలేరు. చలిగావుంది. దుప్పటి కప్పుకోమంటారా!"

"చాల ప్రొద్దయిపోయింది. వర్షంవెలిసే సూచనలుకూడా కన్పించడంలేదు. నిద్రపొండి!"

"మీ రెక్కడ పండుకుంటారు?"

"వరండాలో!"

"జల్లుపడుతుందిగా!"

"పర్వాలేదు."

"త్యాగంచేస్తున్నారా!"

"అలవాటులేదు."

"భలేగా మాట్లాడతారు."

"మీరే నేర్పుతున్నారు."

"బాగుపడతారు."

"అయితే కృతజ్ఞుడ్ని."

మధు లేచి, వర్షంపడనిచోట వాలుకుర్చీ వేసుకున్నాడు. మెల్లిగా కళ్ళు మూశాడు. మాగన్నుగా నిద్రపట్టింది. ఒక రాత్రి మెలుకువవచ్చింది. బాగా వర్షం వెలిసిపోయింది. గది తలుపులు దగ్గరగా జారగిలవేసివున్నాయి.

లేచి తెరచిచూశాడు.

రాధ మత్తుగా నిద్రపోతోంది. వెంటనే తలుపులు దగ్గరగావేసి, కుర్చీలోవచ్చి కూర్చున్నాడు. పెరటిలో గులాబిచెట్టు గాలికి వొంగిపోయివుంది. రేకులు నీళ్ళలో తేలుతున్నాయి.

ఆకాశం నిర్మలంగావుంది. చల్లని గాలితెరలు సన్నగా వీస్తున్నాయి. మధు లేచి గది తలుపులు తెరచాడు.

నరాలలోని రక్తాన్ని ఎవరో ఏ తాంతో తోడేస్తున్నట్లుగా శిలయ్యాడు.

రాధ వికలిత నిద్రలో మునిగిపోయివుంది. మంచం పట్టెమీదవచ్చి కూర్చున్నాడు. భయంతో వొణికిపోయాడు. గుండె దడదడ కొట్టుకుంటోంది. ఎంత అదిమిపట్టినా శబ్దం ఆగడంలేదు.

వణుకుతున్న చేతులతో ఆమె బుగ్గలను స్పృశించాడు. ఆమె ఉలిక్కిపడిలేచింది.

"మధు!"

అతడు మంచంమీదనుంచిలేచి, తల వంచుకొని దూరంగా నిలబడ్డాడు.

"ఈ ప్రపంచంలో మిమ్మల్ని ఒక్కర్ని విశ్వశించాను."

అతడు సిగ్గుతో కృంగిపోయాడు.

"మీకంటె సుందరం, వెంకట్రావులే నయం."

అతడు అవమానంతో కృంగిపోయాడు.

"మీరు యితరులకు పాఠం నేర్పబోయేముందు, మీ మనస్సును మంచిగా చేసుకోండి."

అతడు నిలువెల్లునా భయంతో వణికిపోయాడు.

"ఒక తృటికాలంలో అమూల్యమైన ఆశయాన్ని అంతంచేశారు."

అచ్చట వుండలేక వెంటనే బయటకు వచ్చేశాడు.

"వెళ్ళిపోకండి! మీకు కావలసింది తుచ్ఛమైన ఈ శరీరం! అంతేనా!"

"రాధా! నన్ను చంపకు! నేను చనిపోయాను."

"చనిపోయిన మీ శవంలోనుంచి దాటిపోయిన ఆత్మను తాకండి. జ్ఞానోదయం గల్గుతుంది."

రాధ వెళ్ళిపోయింది!

డాక్టరు కే. యన్. కేసరిగారి

## నా చిన్ననాటి ముచ్చట్లు

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాదమ్స్ స్టాల్సులో దొరుకుతుంది